10న రెడ్డి కాలేజ్ స్నాతకోత్సవం



వివరాలు వెల్లడిస్తున్న ప్రొ.సుదర్శన్‌రెడ్డి

కాచిగూడ: రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 13వ స్నాతకోత్సవ ఈనెల 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొ. జి.సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుతాదేవి తెలిపారు. శుక్రవారం నారాయణగూడలోని కళాశాలలో 2021, 2022 విద్యా సంవత్సర విద్యార్థుల స్నాతకోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. వి.బాలకిష్టారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఓయూ ప్రొ. కె.శశికాంత్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.వాణిమాధవి, వైస్ ప్రిన్సిపల్ కె.సింధూరి, డాక్టర్ సుచిత్ర, కె.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



టీపీసీసీ అధ్యక్షుడితో కాంగ్రెస్ నేతలు

అంబర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమా పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేటకు చెందిన పలువురు పార్టీ నేతలు ఆయనను గాంధీ భవన్‌లో కలిసి నూతన సంవత్సర శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, లేబర్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం చారి, ఆల్ ఇండియా సర్వ సేవా సంఘ్ అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి, డి.చందులాల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మ విద్యార్థినులకు ఉచిత శిక్షణ

చిక్కడపల్లి: కమ్మ సామాజికవర్గానికి చెందన పేద విద్యార్థినులకు సివిల్స్ గ్రూప్–1 పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని కమ్మ జన సేవా సమితి ప్రతినిధులు, పోటీ పరీక్షల నిపుణుడు లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్లో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారికి ఏడాది పాటు ఆఫ్‌లైన్, రెండేళ్ల పాటు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 83309 34815.

బాకారం మల్లన్న దేవాలయంలో మైలపోలు



పూజలో నల్లవెల్లి అంజిరెడ్డి తదితరులు

ముషీరాబాద్: బాకారంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాలలో భాగంగా శుక్రవారం మైలపోలు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి, మాజీ చైర్మన్ ఊర్మిల స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మల్లన్నస్వామికి కల్యాణం, బోనాల ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ఈవో రఘు, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, హారిక, యాదగిరి, అశోక్‌గౌడ్, సురేష్‌గౌడ్, రామానంద రెడ్డి, వై.బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ



పడిపూజలో బిజ్జ కనకేష్‌కుమార్, నవీన్‌గౌడ్

ముషీరాబాద్: భరత్‌నగర్‌లో అయ్యప్పస్వామి 29వ మహా పడిపూజను ఓబీసీ మోర్చా నేత బిజ్జి కనకేష్‌కుమార్ శుక్రవారం నిర్వహించారు. అయ్యప్పమాలధారులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి పాలాభిషేకం, నెయ్యి అభిషేకం, పల్లకీ ఊరేగింపు, ఆభరణాల సేవా చేశారు. ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, పార్టీ నాయకులు నవీన్‌గౌడ్, నందు, విశ్వం, చారి, అనిల్‌కుమార్, పద్మ స్వామివారిని దర్శించుకున్నారు.

సమాజాన్ని మేల్కొల్పే రచనలు చేయాలి

చిక్కడపల్లి: సమైక్య సాహితీ కరీంనగర్, త్యాగరాయ గానసభల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సుదర్శనం హన్మండ్లు స్మారక సాహితీ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి నందిని సిద్దారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అక్షరాలతో సమాజాన్ని మేల్కొల్పే రచనలు చేయాలన్నారు. అనంతరం పలువురు ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించారు.

హౌసింగ్ బోర్డు స్థలాలు కబ్జా.!

స్థలాల పరిరక్షణలో తీవ్ర నిర్లక్ష్యం

● పట్టించుకోని హౌసింగ్ బోర్డు అధికారులు ● స్థలాలను కాపాడాలని డిమాండ్



బాగ్‌లింగంపల్లిలో కబ్జాకు గురైన హౌసింగ్ బోర్డు స్థలాన్ని చూపిస్తున్న సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని పలు ప్రాంతాలలో కోట్లాది రూపాయల విలువ చేసే హౌసింగ్‌బోర్డు స్థలాలు కబ్జాకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. బాగ్‌లింగంపల్లిలోని ఎంఐజీలో సుమారు 1300ల గజాల పార్కుకు కేటాయించిన స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నా అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఓ దశలో అధికారులు ఈ స్థలాన్ని ఖాళీ చేయించడానికి ప్రయత్నించగా కబ్జా చేసిన వ్యక్తి సిటీ సివిల్ కోర్టులో కేసు వేశారు. సుదీర్ఘ వాదన తరువాత తప్పుడు సాక్ష్యాలతో పార్కును కబ్జాకు ప్రయత్నించారని హౌసింగ్‌బోర్డుకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అయినప్పటికీ హౌసింగ్‌బోర్డు అధికారుల నిర్లక్ష్యం వల్ల సదరు వ్యక్తి హైకోర్టుకు వెళ్లినట్లు సమాచారం. అంతేకాకుండా ఎల్ఐజీలో ఓ వ్యక్తి సుమారు కోటి రూపాయలు విలువ చేసే వంద గజాల స్థలాన్ని కబ్జా చేసినప్పటికీ అధికారులు ఖాళీ చేయించలేకపోయారు.ఇదేమిటని అధికారులు ప్రశ్నిస్తే అతను కూడా కోర్టులో కేసు వేసినట్లు సమాచారం.

◆ ఇలా బాగ్‌లింగంపల్లిలోని పాలమూరు బస్తీతో పాటు పలు ప్రాంతాలలో ఖాళీగా ఉన్న హౌసింగ్‌బోర్డు స్థలాలకు ఆనుకుని ఇళ్ల యజమానులు వాటిని కబ్జా చేస్తూ పాగా వేస్తున్నారు. హౌసింగ్‌బోర్డు అధికారులు కబ్జాదారులతో కుమ్మకు కావడం వల్లనే ఇలాంటి కబ్జాలు జరుగుతున్నాయని స్థానికులు బాహాటంగానే అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం వల్లనే కబ్జాలు



హౌసింగ్‌బోర్డు అధికారుల నిర్లక్ష్యం, అవినీతి వల్లనే బాగ్‌లింగంపల్లిలోని పలు ప్రాంతాలలో ఖాళీగా ఉన్న స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. దీనిపై తమ పార్టీ అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నప్పటికీ అధికారుల్లో కదలిక లేదు. తప్పుడు పత్రాలు సృష్టించి కోర్టులో కేసు వేస్తున్నప్పటికీ అధికారులు తగిన రీతిలో స్పందించడం లేదు.

– సీపీఎం నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్

స్థలాలను స్వాధీనం చేసుకోవాలి



కబ్జాకు గురైన హౌసింగ్ బోర్డు స్థలాలను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలి. హౌసింగ్ బోర్డు ఖాళీ స్థలాలలో చుట్టూ ఫెన్సింగ్ వేయాలి. కబ్జాకు గురవుతున్న వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలి. ఇట్టి విషయంపై తాము పోరాటం చేస్తున్నప్పటికీ అధికారుల్లో స్పందన కరువైంది.

– ఎం.దశరథ్, కేవీపీఎస్ నగర కార్యదర్శి

దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ



చిక్కడపల్లి: సంఘ సంస్కరణకు కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం త్యాగరాయ గానసభ నిర్వహణలో 'దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ యాదిలో..'నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాలకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పాఠశాలను స్థాపించి వారి అభ్యున్నతికి పునాదులు వేశారని గుర్తుచేశారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు దేవసేన, బాలాజీకుమార్, ఎం.రుక్మిణి పాల్గొన్నారు.

నియోజకవర్గంలో రోడ్ల సమగ్రాభివృద్ధికి కృషి



బాపునగర్‌లో సీసీరోడ్ల పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయకుమార్

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ బాపునగన్‌లో రూ. 18 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రధాన రోడ్‌లతో పాటు అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతి బస్తీలో మెరుగైన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, వీధిలైట్లు ఉండేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక సమస్యలపై పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు రామారావు యాదవ్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి దోహదపడే ఆవిష్కరణలు ఉండాలి



స్ప్లాష్ - 2కే25 కార్యక్రమంలో మాట్లాడుతున్న చేతనాజైన్

కాచిగూడ: దేశ అభివృద్ధికి దోహదపడేలా నూతన ఆవిష్కరణలు ఉండాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ తెలంగాణ చాప్టర్ అధ్యక్షురాలు చేతనా జైన్ అన్నారు. బద్రుకా పీజీ సెంటర్ ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన మెగా మేనేజ్‌మెంట్, కల్చరల్ పోటీలు 'స్ప్లాష్–2కే25'కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశ పునర్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు జ్ఞాన సముపార్జనపై దృష్టిని సారించాలని సూచించారు. నటుడు రేడియో జాకీ, గాయకులు నోయెల్ సీన్, బద్రుకా కళాశాల డైరెక్టర్ జనరల్ ప్రొ. అభిరామకృష్ణ, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, స్ప్లాష్ కన్వీనర్ డాక్టర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు ఫణిశ్రీ కొంటే, సత్యదీప

కాచిగూడ: ప్రస్తుతం ఆరోగ్యంలో ఆయుర్వేద వైద్యం ప్రధాన పాత్ర పోషిస్తోందని జీవశ్రీ అయుర్వేదిక్ వెల్నెస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఫణిశ్రీ కొంటే అన్నారు. శుక్రవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిల్లలకు ఆయుర్వేద వైద్యంపై ఆమె అవగాహన కల్పించారు. శుక్ర, శని, ఆదివారాల్లో పిల్లలకు ఆయుర్వేద వైద్యంపై శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. 6వ తేదీన మహిళలకు అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ఆయుర్వేద వైద్యంలో మరిన్ని పరిశోధనలు జరగాల్సిన రగాల్సిన అవసరం ఉందన్నారు. అంతరించిపోతున్న సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యదీప, డాక్టర్ సునిత, బీడీఎం ఎ.మల్లికార్జున్ యాదవ్, భాగ్య, అతిథి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



అంబర్‌పేట: నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్పొరేటర్లు బి.పద్మావెంకట్‌రెడ్డి, విజయకుమార్‌గౌడ్‌తో కలిసి జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అభివృద్ధి పనులపై తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. జాప్యం లేకుండా సకాలంలో అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. నిధుల మంజూరు అంశాన్ని తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో జలమండలి జీఎం రామకృష్ణ, డీజీఎంలు విష్ణువర్ధన్‌రావు, కృష్ణ, జీహెచ్ఎంసీ ఈఈ రమేశ్‌బాబు, డీఈలు ప్రశాంతి, సంజయ్‌కుమార్‌లతో ఏఈలు పాల్గొన్నారు.

50వ బూత్ బీజేపీ అధ్యక్షుడిగా సంకీర్తియాదవ్

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్‌లోని 50వ బూత్ బీజేపీ అధ్యక్షుడిగా సలంద్రి సంకీర్తి యాదవ్ ఎన్నికైనట్లు మాజీ కార్పొరేటర్ బూత్ ఎలక్షన్ ఇన్‌చార్జి టి.రవీందర్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు మహేందర్ బాబు, నాయకులు టి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, విఠల్, లింగంగౌడ్, రమేష్, పీఎన్ చారి, గంటా శ్రీనివాస్, సూర్యనారాయణ ఆయనకుకు శుభాకాంక్షలు తెలిపారు.

పింఛన్‌దారులకు ఆరోగ్య భద్రత కల్పించాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పింఛన్‌దారులందరికీ ఆరోగ్య భద్రత ప్రభుత్వమే కల్పించాలని తెలంగాణ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.కృష్ణమూర్తి కోరారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కనీస పింఛన్ రూ.9వేలు చెల్లించాలన్నారు. పెరిగే ధరలకు అనుగుణంగా కరువు భత్యం ఇవ్వాలన్నారు. కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా అందరికి హయ్యర్ పింఛన్ వర్తింపజేయాలని కోరారు.ఈపీఎస్ పెన్షనర్లకు వారి జీవిత భాగస్వాములకు రైల్వే ప్రాయాణాలలో రాయితీ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈపీఎస్ కన్వీనర్ బ్రహ్మాచారి, నాగేశ్వర్‌రావు, దుర్గాప్రసాద్, రామారావు, శంకర్‌రావు తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షణీయం

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను శుక్రవారం అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాల వేసి షనివాళులర్పించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవకీదేవి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షణీయమని అన్నారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కామన్ విద్యా విధానమే సావిత్రిబాయి పూలే ఆశయమని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు అన్నారు. అందరికీ విద్య ఆరాధ్యురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. మహిళా విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన కృషి ఎనలేనిదన్నారు. కుల వివక్షత, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీర మహిళ అని కొనియాడారు. నారాయణగూడ పద్మశాలి భవన్‌లో జరిగిన సమావేశంలో అడ్వకేట్ వనం దుశ్యంతల మాట్లాడుతూ.. విద్య గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని అన్నారు. బాలికల విద్య కోసం విశేష కృషి చేసిన ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ.. పూలే దంపతులు సంఘ సంస్కరణకు పూనుకున్నారని అన్నారు.

– అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ బృందం



సన్మానం పొందిన ముషీరాబాద్ పాఠశాల ఉపాధ్యాయులతో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్



సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న డాక్టర్ దేవకీదేవి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం వద్ద సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న టి.స్కైలాబ్‌బాబు



వివేకానంద డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



బతుకమ్మ కుంటలోని ప్రభుత్వ పాఠశాలలో నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్‌యాదవ్, నాగభూషణం, వెంకటేష్



అలీకేఫ్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు



గాంధీనగర్ డివిజన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పావని



మాట్లాడుతున్న ప్రొ. దేవరాజు మహారాజ్, కమర్షియల్ ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ సత్యనారాయణ



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మురా జైసింహ, పూస గోరక్‌నాథ్



మాట్లాడుతున్న అడ్వకేట్ వనం దుశ్యంతల